క్లుప్తంగా

వైభవంగా గోదా జయంతి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6లోని శ్రీ వేంకటేశ్వర, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీగోదా దేవి అమ్మవారి జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం వైభవంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించారు. హోమం, పంచామృతాభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని వివిధ పూలమాలలో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులతోపాటు పలువురు కాలనీ ప్రముఖులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



గాంధీనగర్ హాస్టల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

ఆరిలోవ : జీవీఎంసీ పదకొండో వార్డు పరిధి గాంధీనగర్‌లో నేతాజీ సుభాస్ చంద్రబోస్ హాస్టల్ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రవి కుమార్ సోమవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులు, గాంధీనగర్ పెద్దలతో కలిసి హాస్టల్‌ను రవికుమార్ సందర్శించారు. అక్కడ 130 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను పెద్దలు చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా హాస్టల్ నిర్వాహకులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గాంధీనగర్ సంఘం పెద్దలు మూది అప్పారావు, రాగతి అచ్చుతరావు, లేబర్ డిపార్ట్‌మెంట్ విశ్రాంత జాయింట్ కమిషనర్ వెంకట్, లేబర్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ ఎల్లాజీ పాల్గొన్నారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో నాయకులు

టీచర్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్ బజార్‌లో యూజీడీ పనుల కోసం కార్పొరేటర్ పల్లా అప్పలకొండ ఆధ్వర్యంలో పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.39.72 లక్షలతో రెండు డ్రైనేజీలు నిర్మించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర మేయర్ పీలా శ్రీనివాస్ ముందుగా పూజలు చేశారు. నాణ్యతతో వేగంగా డ్రైనేజీలను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, తూర్పు ప్రచార కమిటీ అధ్యక్షుడు సంపంగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్‌కు నివాళి



హరిశ్చంద్రప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీవీ రామ్, తదితరులు

ఎంవీపీ కాలనీ : ఆంధ్ర షుగర్స్ వ్యవస్థాపకుడు ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ 104వ జయంతిని పురస్కరించుకుని ఘనంగా నివాళులర్పించారు. ముళ్లపూడి కుటుంబ సభ్యులు, తెలుగు శక్తి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వెంకోజీపాలెంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ మాట్లాడుతూ హరిశ్చంద్రప్రసాద్ 1947లో ఆంధ్ర షుగర్స్ స్థాపించి వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. దేశంలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆయన జీవితం ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సాగర తీరంలో గ్రామ సింహాలు

పర్యాటకులను భయపెడుతున్న కుక్కలు | కట్టడికి జీవీఎంసీ చర్యలు శూన్యం



తీరంలో పర్యాటకుల మధ్యలో సేద తీరుతున్న శునకాలు



ఉదయం వేళలో వాకర్స్ పక్కనే కుక్కలు



ఆర్‌కే బీచ్ వద్ద ఫుట్‌పాత్‌పై సంచరిస్తున్న శునకాలు

ఏయూ క్యాంపస్ : సాగర తీరంలో ఆహ్లాదకర వాతావరణంలో గడపాలని వచ్చే వారిని గ్రామ సింహాలు భయపెడుతున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో శునకాలు సాగర తీరం వెంట సంచరిస్తూ పర్యాటకులను, నగరవాసులను ఇబ్బంది పెడుతున్నాయి. కొంత మంది ఇచ్చే ఆహారం తింటూ అవి అక్కడే ఉండిపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో పర్యాటకుల వెంట పడుతూ వారిని భయభ్రాంతులను చేస్తున్నాయి. వీటిని కట్టడి చేసే దిశగా జీవీఎంసీ అధికారులు దృష్టి సారించడం లేదు.

తీరం నిండా శునకాలే...

సాగర తీరం నిండా శునకాలే కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఆర్‌కే బీచ్ వద్ద పదుల సంఖ్యలో శునకాలు పర్యాటకుల మధ్యలో సేదతీరుతూ, సంచరిస్తూ కనిపిస్తున్నాయి. దీంతో పర్యాటకులు స్వేచ్ఛగా బీచ్‌లో సంచరించలేని పరిస్థితి నెలకొంది. సాయంత్రం వేళల్లో పర్యాటకులు, నగరవాసులు అధికంగా బీచ్‌కి వస్తుంటారు. ఈ సమయంలో కుక్కలు గుంపుగా సంచరిస్తుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. వారి చేతిలో ఉన్న ఆహార పదార్థాల కోసం అవి వెంట పడుతున్నాయి. దీంతో చిన్నారులను స్వేచ్ఛగా కిందకు దింపే పరిస్థితి లేకుండా పోయింది. అదేవిధంగా విదేశీ పర్యాటకులు వీటిని చూసి భయాందోళన చెందుతున్నారు. ఆహ్లాదంగా గడుపుదామని తీరానికి వచ్చే వారిని ఇవి ముప్పుతిప్పలు పెడుతున్నాయి.

పర్యాటకుల వెంటే పరుగు తీస్తూ...

సాయంత్రం వేళల్లో కుటుంబ సభ్యులతో సాగర తీరానికి వచ్చే పర్యాటకులు ఇసుకలో, అలల వద్ద ఆడుకుంటుంటారు. ఎక్కువ మంది ఇసుక తిన్నెలపై స్నేహితులతో గడపడానికి ఇష్టపడతారు. అదే సమయంలో పరుగు పందెం పెట్టుకోవడం, ఇసుక తిన్నెలపై పరుగులు పెట్టడం పరిపాటి. అటువంటి సందర్భాల్లో కుక్కలు వారి వెంట పడుతున్నాయి. దీంతో సాగర తీరంలో ఆడుకోవడానికి చిన్నారులు భయపడే పరిస్థితులు తలెత్తుతున్నాయి.

వాకర్స్‌కి ప్రతీ క్షణం గండమే

నిత్యం ఉదయం వేళల్లో బీచ్‌కి వాకింగ్‌కి వచ్చే వారికి క్షణం క్షణం గండంగా గడుస్తోంది. రహదారి మధ్యలో, ఫుట్‌పాత్‌లపై పదుల సంఖ్యలో శునకాలు గుంపులుగా సంచరిస్తూ అందరినీ భయపెడుతున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇవి సంచరించే ప్రాంతాలకు వెళ్లడానికి భయపడుతున్నారు. రాత్రి వేళల్లో పర్యాటకులు తిని వదిలేసిన ఆహారం ఇవి స్వీకరిస్తూ అక్కడే తిష్ట వేసుకుని కూర్చుంటున్నాయి. తీరంలో శునకాల సంఖ్య పెరిగిపోతున్నా జీవీఎంసీ అధికారులు దృష్టి సారించడం లేదు. ఇటీవల జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవం సమయంలో వీటి సంచారం కొంత తగ్గినా, ప్రస్తుతం ఆర్‌కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు పదుల సంఖ్యలో శునకాలు కనిపిస్తున్నాయి. వీటిని ఇక్కడి నుంచి తరలిస్తే పర్యాటకంగా పేరు తెచ్చుకున్న సాగర తీరానికి మరింత మంది పర్యాటకులు స్వేచ్ఛగా వచ్చే అవకాశం ఉంది.



ఇసుకలో ఆడుకుంటున్న చిన్నారులు

గడప గడపకు చంద్రబాబు మోసాలు



సిద్ధార్థనగర్‌లో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు సిద్ధార్థనగర్ బూత్ నంబర్ 226లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రయాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు నాయకత్వంలో పీతల గోవింద్, స్థానిక నాయకులు గడప గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను పొందుపరిచిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చేసిన దగాను వివరించారు. ఈ ఏడాది కాలంలో చంద్రబాబు ప్రజలను ఏవిధంగా మోసం చేశారో తెలిపారు. చంద్రబాబు చేస్తున్న మోసం గ్రహించిన జనమంతా జగన్‌కు జై కొట్టారు. కార్యక్రమంలో పీతల మహేష్, తాటిపూడి రాజు, స్తంభాల క్రిష్ణ, అన్నపూర్ణ, కాంతమ్మ, లక్ష్మి, మంగమ్మ, పద్మ, బి.లక్ష్మి, శ్యామ్, నీలపు మురళి, సిద్ధార్థనగర్ యూత్, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మూర్తియాదవ్ వేధింపులు భరించలేకపోతున్నాం

- రెండు నెలలవుతున్నా రజకవీధి కాలువ నిర్మించలేదు
- కక్షపూరితంగా బడ్డీ తొలగించాలని బెదిరిస్తున్నారు
- 22వ వార్డులో పర్యటించాలని జీవీఎంసీ కమిషనర్‌కు స్థానికుల ఫిర్యాదు



జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న రజకవీధి నివాసులు

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డులో స్థానిక కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, సచివాలయం సిబ్బంది కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నారని, కార్పొరేటర్ వేధింపులు భరించలేకపోతున్నామని... వార్డులో పర్యటించి తమకు న్యాయం చేయాలని రజకవీధి నివాసితులు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానిక నివాసి నేతల కనక చేసిన ఫిర్యాదులో వివరాలిలా ఉన్నాయి. ''కళాభారతి రోడ్డులోని రజక వీధిలో 60 ఏళ్లగా నివసిస్తున్నాం. చిన్న కిరాణా షాప్ పెట్టుకొని కుటుంబ సభ్యులను పోషించుకుంటున్నాం. షాప్ ఉన్న స్థలానికి 40 ఏళ్లగా పన్ను, కరెంట్ బిల్లు చెల్లిస్తున్నాం.

ఈ స్థలం విషయంలో కోర్టు తమకు పర్మినెంట్ ఇంజెక్షన్ ఆర్డర్ కూడా ఇచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎటువంటి ఆర్డరూ పాస్ చేయకపోయినప్పటికీ 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ గత నాలుగేళ్లుగా సొంత ఆలోచనలతో ఇబ్బంది పెడుతున్నారు. వార్డులో ప్రతీదీ ధ్వంసం చేస్తున్నారు. ఇప్పటికే చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టాలని చూస్తే.. వారికి కోర్టు న్యాయం చేసింది. ఇటీవల 22వ వార్డు సచివాలయం సిబ్బందితో వచ్చి నన్ను, కుటుంబ సభ్యులను బెదిరించి షాప్ ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. షాప్ ఇరగ్గొట్టేస్తానని బెదిరిస్తున్నారు. తప్పుడు మాటలతో మా కుటుంబంలోని స్త్రీలను కూడా తిడుతున్నారు. రజక వీధికి వెళ్లే రోడ్డు మార్గం తవ్వి డ్రైనేజీ నిర్మాణం చేపట్టకుండా స్థానికుల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. స్థానికులు ప్రశ్నిస్తే మా బడ్డీని చూపించి... మా వల్లే పని చేయడం లేదని మూర్తియాదవ్ మమ్మల్ని అవమానిస్తున్నారు. అసలు డ్రైనేజ్ నిర్మాణానికి, బడ్డీకి సంబంధం ఏంటో అర్థం కావడం లేదు. 40 రోజులుగా సచివాలయం సిబ్బంది, కార్పొరేటర్ మూర్తియాదవ్ బెదిరించి, వేధిస్తుండడంతో ఆరోగ్యంగా ఉన్న మా అమ్మ బెంగతో 10 రోజుల క్రితమే చనిపోయారు. సచివాలయం టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా వార్డులో పర్యటించి అందరికీ న్యాయం చేయండి.'' అని కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో నేతల కనక వేడుకున్నారు.

విమ్స్‌ను నిర్లక్ష్యం చేసిన కూటమి ప్రభుత్వం

- సరిపడా మందులూ అందించడం లేదు
- సూపర్ సిక్స్ పథకాలు గాలికొదిలేశారు
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



పన్నెండో వార్డులో చంద్రబాబు మోసాలను వృద్ధురాలికి వివరిస్తున్న మొల్లి అప్పారావు



పదో వార్డు రాజీవ్‌నగర్‌లో యువకుడికి కరపత్రం అందజేస్తున్న మొల్లి అప్పారావు



పదమూడో వార్డులో చంద్రబాబు మోసాలను మహిళకు వివరిస్తున్న మొల్లి అప్పారావు

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతానికి అత్యంత అందుబాటులో ఉన్న విమ్స్ ఆస్పత్రిని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆరోపించారు. జీవీఎంసీ 10, 12, 13వ వార్డుల్లో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. ఆయా వార్డుల్లోని స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. వృద్ధులు, యువకులు, మహిళలను కలిసి కూటమి ప్రభుత్వం నెరవేర్చని హామీలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో విమ్స్‌లో వేల మందికి వైద్య సేవలు అందించారన్నారు. అలాంటి విమ్స్‌ను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా విడిచిపెట్టేసిందన్నారు. సరైన వైద్యులు లేకుండా, మందులు సైతం సరిపడా సరఫరా చేయలేకపోతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా గాలికి వదిలేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును నమ్ముకుని ఓటేసిన ప్రజలకు మోసం మాత్రమే మిగిలిందని విచారం వ్యక్తం చేశారు. కూటమి మోసాలు గురించి ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కూటమి నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

- జీవీఎంసీ 10వ వార్డులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం రాజీవ్‌నగర్, వెటర్నరీ కాలనీలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంట్రెడ్డి రామన్నపాత్రుడు, స్థానిక నాయకులు వైదా నారాయరావు, పతివాడ వెంకటలక్ష్మి, బొండా శ్రీను, తులసి, మొల్లి వెంటకరమణ, కనకల కృష్ణ, కుమారి, కాంతం, రాధ, సత్యవతి, ఆనంద్, నాయుడు, చిట్టిరాణి తదితరులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 12వ వార్డులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం అంబేడ్కర్‌నగర్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో మొల్లి హేమంత్, వరహాలు, జేమ్స్, గ్లోరీ, వెంకట్, అప్పలరాజు, అర్జున్, రమణ పాల్గొన్నారు..
- జీవీఎంసీ 13వ వార్డు పరిధి ఏఎస్ఆర్ నగర్‌లో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.శిరీష, బేత దుర్గారావు, సాగరిక, జగదీష్, వాసు, ఈశ్వరరావు, బంగారాజు, తదితరులు పాల్గొన్నారు.

నివాసాల మధ్య పిచ్చి మొక్కలు



విశాలాక్షినగర్ కోదండ రామాలయం ఎదురుగా కొండ అంచున నివాసాల మధ్య పిచ్చి మొక్కలు

ఆరిలోవ : జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్‌లో పలుచోట్ల నివాసాల మధ్య పిచ్చి మొక్కలు మొలిశాయి. ఇక్కడ ఎక్కువ భాగం సీతకొండను ఆనుకుని నివాసాలున్నాయి. కొండ అంచున ఉన్న వీధుల్లో పిచ్చి మొక్కల సమస్య నెలకొంది. కోదండ రామాలయం ఎదురుగా వీధుల్లో కొండ అంచున రోడ్డుకి ఇరుపక్కలా పిచ్చి మొక్కలు దట్టంగా మొలిశాయి. ఇక్కడి కొండ పైనుంచి వస్తున్న పాములు, ముళ్ల పందులు ఈ మొక్కల్లోకి చేరడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. తరుచూ ముళ్ల పందులు ఇక్కడి మొక్కల్లోకి చేరుతున్నాయని స్థానికులు అంటున్నారు. వాటి నుంచి భయంతో ఇంటి తలుపులు నిరంతరం మూసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శానిటరీ అధికారులు స్పందించి మొక్కలు తొలగించాని స్థానికులు కోరుతున్నారు.

తల్లిదండ్రులను సంతోషంగా ఉంచాలి



వృద్ధులతో మాట్లాడుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సమత కళాశాలలో నేషనల్ పేరెంట్స్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా నగరంలోని పలు వృద్ధాశ్రమాలను సందర్శించి అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధులతో మాట్లాడారు. వారి అనుభవాలను, పిల్లల అభివృద్ధికి వారు చేసిన శ్రమను, జీవితంలో అనుభవించిన కష్టాలను తెలుసుకున్నారు. వారి తల్లిదండ్రులను సంతోషంగా ఉంచేందుకు అవసరమైన నడవడికను తెలుసుకున్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరిలోవలో అంధకారం



ఆరిలోవ ప్రాంతం సుందరయ్యకాలనీలో చీకటి

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో వారం రోజులుగా చీకటి అలుముకొంది. అసలే అమావాస్య రోజులు, అపై వీధి దీపాలు వెలగకపోవడంతో చీకటిలో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వీధుల్లో ఒకటో, రెండో స్తంభాలకు ఉండే బల్బులు పాడైతే వేరే స్తంభం నుంచి విద్యుత్ దీపం లైటింగ్ కనిపిస్తుంటుంది. అలా కాకుండా కాలనీలోని వీధుల్లో అన్ని బల్బులు వెలగడం లేదు. టి.ఐ.సి.పాయింట్, అంబేడ్కర్ నగర్, జ్యోతినగర్, సుందరయ్య కాలనీ, పార్వతినగర్, శ్రీకాంత్‌నగర్‌లో సుమారు వారం రోజుల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అధికారులు విద్యుత్ ఆదా చేయడానికి వీధి దీపాలు వెలిగించడం లేదో..?, లేదంటే బల్బులు పాడవడంతో నిర్వహణ పనులు చేయడం లేదో..? తెలియక స్థానికులు చీకటిలో గడిపేస్తున్నారు. దీంతోపాటు బీఆర్‌టీఎస్ రోడ్డులో హనుమంతవాక నుంచి పైనాపిల్‌కాలనీ వరకు ఏ లైన్‌లోనూ వీధి దీపాలు వెలిగించకుండా వదిలేశారు. ఇటీవల జరిగిన సింహాచలం గిరి ప్రదక్షిణ సందర్భంగా బీఆర్‌టీఎస్‌లో అన్ని లైన్లలో దీపాలు బాగుచేసి వెలిగించారు. ఇప్పుడు వారం రోజులుగా ఆ దీపాలు మళ్లీ మూలకు చేరడం విశేషం. ఈ చీకటిలో చిన్న పని మీద ఇంటి నుంచి బయటకు వెళ్లాలన్నా వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా డిజిటల్ మార్కెటింగ్ అసిస్టెంట్ కోర్సు శిక్షణకు ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి అనుశ్చిత్ జాతి అభ్యుదయ యోజన పథకం కింద మహారాణిపేటలోని నాక్ కేంద్రంలో ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. ఇంటర్ చదివి 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. శిక్షణ కాలంలో మధ్యాహ్నం ఉచితంగా భోజన సదుపాయం కల్పిస్తామని, స్టేషనరీ కూడా అందజేస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రభుత్వ సర్టిఫికెట్ జారీ చేసి, సంబంధిత రంగంలో ఉపాధి కల్పించనున్నారని, పూర్తి వివరాలకు 9676170026, 7989572891లో సంప్రదించాలని సూచించారు.

అర్ధరాత్రి సీపీ ఆకస్మిక తనిఖీలు

- బయటపడిన పోలీస్ స్టేషన్ల లోపాలు

తాటిచెట్లపాలెం: విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చేపట్టిన అర్ధరాత్రి తనిఖీల్లో పలు పోలీస్ స్టేషన్లలోని లోపాలు బయటపడ్డాయి. వివరాలిలా.. ఆదివారం అర్ధరాత్రి దాటాక ద్వారకా, ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్లను సీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఫోర్త్ టౌన్ పీఎస్‌లో విధులు నిర్వర్తించాల్సిన సెంట్రీ నిద్రపోవడాన్ని గుర్తించారు. ద్వారకా స్టేషన్ నిబంధనలకు విరుద్ధంగా తలుపులు మూసి ఉండటాన్ని గమనించారు. వెంటనే సిబ్బందికి మెమోలివ్వాలని సంబంధిత ఏసీపీలకు కమిషనర్ ఆదేశాలిచ్చినట్లు తెలిసింది.

గ్రామకంఠం భూమి మత్స్యకారులకు ఇవ్వాలని వినతి



మంత్రికి, కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు తెడ్డు పరసన్న

మహారాణిపేట : పెదజాలారిపేట గ్రామంలోని గ్రామకంఠం భూమిని సాంప్రదాయ మత్స్యకారులకు సామాజిక అవసరాలకు ఉపయోగించడానికి ఇవ్వాలని గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు తెడ్డు పరసన్న కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్‌లో మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు పలు సమస్యలపై తెడ్డు పరసన్న ఆధ్వర్యంలో మత్స్యకారులు వినతిపత్రం సమర్పించారు. మా తాత ముత్తాతల నుంచి సముద్ర తీరంపై ఆధారపడి జీవిస్తున్నామని, సంప్రదాయ పద్ధతిలో సముద్రంలో చేపలు పట్టుకొని జీవనం సాగిస్తున్న తమకు సామాజిక అవసరాల కోసం స్థలం ఇవ్వాలని కోరారు. ఈ స్థలాన్ని కొట్టేయడానికి కొంతమంది బయటి వ్యక్తులను తీసుకొచ్చి తమపై దౌర్జన్యాలకు దిగుతున్నారని, ఈ స్థలాన్ని తమకు అప్పగించాలని పరసన్న కోరారు.

300వ రోజుకు పోర్టు ఆస్పత్రి పరిరక్షణ దీక్షలు



పోర్టు హాస్పిటల్ వద్ద నిరసన దీక్ష చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణను ఆపాలని కైలాసపురం పోర్టు ఆస్పత్రి వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరసన దీక్షలు 300వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సోమవారం మానవ హారం నిర్వహించారు. అనంతరం సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు పద్మనాభరాజు మాట్లాడుతూ ఈ పోరాటం వల్ల గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ టెండర్‌కు ఎవరూ రాలేదని, ఆస్పత్రి అభివృద్ధి కోసం చైర్మన్ కమిటీ వేశారన్నారు. పోర్టు హాస్పిటల్‌ను పోర్టు సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని, ఈ విషయంపై కూటమి ప్రభుత్వం స్పందించాలని కోరారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం అనర్హమన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో కార్మికులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని ఆయన హెచ్చరించారు. దీక్షకు బీహెచ్‌ఈఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.టి.ప్రకాష్, డాక్‌యార్డ్ యూనియన్ నాయకుడు గణేష్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, గణేష్, శంకరరావు, నర్సింగరావు, త్రినాథరావు, ఈశ్వరరావు, రాఘవులు, బి.జగన్ తదతరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు చేస్తే సహించం



మాట్లాడుతున్న బక్క పరంజ్యోతి

సీతంపేట: దళిత క్రైస్తవులపై దాడులు చేస్తే సహించేది లేదని ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త బక్క పరంజ్యోతి హెచ్చరించారు. దళితుల హక్కుల సాధన కోసం అక్కయ్యపాలెంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనుమతులు లేని చర్చిలపై కూటమి ప్రభుత్వం దాడులు చేయిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత క్రైస్తవులపై ఎటువంటి నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. గతంలో ఉన్న కాంగ్రెస్, ఇపుడు బీజేపీ ప్రభుత్వాలు ఎటువంటి సాయం చేయడం లేదని చెప్పారు. దేశంలో మతం మారడం స్వేచ్ఛతో కూడిన హక్కని, దానిని కాలరాస్తామంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. దళిత క్రైస్తవుల హక్కుల సాధనకు వివిధ రూపాల్లో పోరాడుతామని తెలిపారు.